


పాలకోడేటి సత్యనారాయణరావు

# ఏమున్నది గర్వకారణం?

కారులో ఇప్పటికే గంట సేపటి నుంచీ ప్రయాణం చేస్తున్నా, అంత సేపటినుంచీ ప్రయాణం చేస్తున్నట్లుగానే లేదు. గాలిలో తేలి పోతున్నట్లుగానే ఉంది నాకు. నల్లని, నున్నని తారు రోడ్డు కొత్తగా వేసినట్లుగా ఉంది. దానిమీద ప్రయాణం చాలా సుఖంగా జరుగుతూంది.

ఏడాది క్రితం ఈ రోడ్ల మీద ప్రయాణం అంటే నా కెంతో కంటకంగా ఉండే వంకర టింకర రోడ్లు. ఆ రోడ్లయినా నున్నగా ఉండక గుంటలతో, పెద్ద పెద్ద గోతులతో ఉండేవి. ఎంత ఖరీదయిన కారయినా సరే, ఎంత లగ్జరియస్ కారయినా సరే ఆ రోడ్డు మీద ప్రయాణం చేసి పూర్తయిందనుకునేసరికి ఒళ్ళంతా హూనం అయి పోయేది. అన్ని వేలు, లక్షలు పోసి సుఖమైన కారు కొనుక్కున్నా, కారు సుఖం ఏమాత్రం ఉండేది కాదు.

స్టీరింగ్ ముందు సారంగపాణి. పక్కన నేను. వెనక సీట్లో యశోద—నిజానికి మేం ముగ్గురం కలిసి ప్రయాణం చేస్తున్నప్పుడు చేయాల్సిన గోల, చేసే గోల అంతా ఇంతా కాదు. కానీ ఈ సారి ప్రయాణంలో మా గోలలో ఎక్కడో కుదరని అపశ్రుతి నాకు వినిపిస్తూనే ఉంది.


రియర్ వ్యూ లోంచి చూస్తూంటే వెనక సీట్లో యశోద వెనక ఉన్న అరటి పళ్ళు, బత్తాయి పళ్ళు కనిపిస్తున్నాయి. ఆ పళ్ళ గుట్ట వెనక నుంచి రోడ్డు ముందు రోడ్డు—వెనక రోడ్డు — అంతులేని ప్రయాణమా ఇది?

ఇదే అడిగాను.

సారంగపాణి నవ్వాడు. ఆ నవ్వు ఏదోలా ఉంది. గతంలో సారంగపాణి ఇలా నవ్వేవాడు కాదు. ఏదో తేడా ఉంది.

నవ్వు ఆపుకుంటూ అన్నాడు: "నువ్వు విసుక్కున్నా ఫరవాలేదు కానీ, ఇక కొద్ది పదిహేను నిమిషాలు అంతే. అయినా అంత అంతులేని ప్రయాణంలా అనిపిస్తూందా నీకు?"

నే నేం జవాబు ఇవ్వలేదు.




పోగొట్టుకున్నాను. కన్న కడుపు తీపి మీకు అర్థం కాదు."

"బాబెవరో పరాయి పిల్లాడిలా అంటావేం? వాడు పీకెంతో నాకూ అంతే! ఎటొచ్చీ ఆ దినం—నా రోజు బాగా లేక పోయింది. ఆస్తికి వారసుడైన ఒక్క కొడుకూ మతి స్థిమితం కోల్పోయాడు. అది నా దౌర్భాగ్యం!"

"వద్దంటే విన్నారు కాదు. ఆస్తి ముక్కలయి పోతుందని ఒక్క కొడుకుతోనే చాలనిపించారు నా చేత!"

ఇది ఇద్దరి మధ్యా వాగ్వాదం —కానీ నాకు అన్ని విషయాలు తెలుస్తున్నాయి.

యశోద తనంత తానే చెప్పసాగింది — "ఆయన కాన్ఫరెన్స్‌కని ఢిల్లీకి వెళ్ళిపోయారు. బాబుకు టెంపరేచర్. అప్పుడు మామూలు టెంపరేచర్. డాక్టర్ వచ్చి రెండు ఇంజక్షన్స్ చేశాడు. మర్నాడు పొద్దున్నకు జ్వరం తగ్గాలి. తప్పితే హెచ్చకూడదు కదా! కానీ జరిగింది అదే. ఒళ్ళు కాలిపోతూంటే డాక్టర్ వచ్చి 'మీ బాబుకి మీసెల్స్' అన్నాడు. అయినా ఫర్వాలేదు అన్నాడు. సాయంత్రానికి జ్వరం అలాగే ఉంది. మర్నాడు ఉదయానికి బాబులో చాలా మార్పు కనపడింది. నన్ను గుర్తు పట్టలేక పోతున్నాడని అనుమానం వచ్చింది. అటు డాక్టరుకు కబురు పెట్టాను; ఇటు ఈయనకు ఢిల్లీకి కాల్ బుక్ చేశాను. కానీ లైన్స్ అన్నీ అవుటాఫ్ ఆర్డర్. ఖర్మ అనుకొని టెలిగ్రాం ఇచ్చాను. డాక్టర్ వచ్చి అబ్బాయికి బ్రెయిన్ నెర్వ్స్ అన్నీ పాడయిపోయాయనీ, ఇక తేరుకోవటం కష్టమనీ అన్నాడు!"

"దాంట్లో నా తప్పేం ఉందో చెప్పు!" అన్నాడు సారంగపాణి.

"ప్రసాద్ చెప్పాడు కదా—మీసెల్స్‌కు కూడా వాక్సిన్ ఉందని, మీ రెందుకు ఇప్పించలేదది?"

మీసెల్స్‌కి వాక్సిన్ ఉందా? ఇది నాక్కూడా తెలీదు.

"ఇప్పించేవాడిని ముందు తెలిస్తే! కానీ డాక్టర్ చెప్పాడు కదా ఆ వాక్సిన్ మన దేశంలో దొరకటం లేదని. మామూలుగా ఇప్పించే డి.పి.టి. వంటి వన్నీ ఇప్పించాను. పోనీ నీ దగ్గర్నుంచీ తెప్పిద్దామన్నా అది నివారణకే కానీ వైద్యానికి పనికి రాదట! జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇక ఏం చేసీ లాభం లేదని డాక్టర్ స్పష్టం చేశాడు.

నాకు కష్టం కలిగింది — ఆఫ్టరాల్ మీసెల్స్ అనుకొంటున్నాం కానీ, అది ఇంత ప్రమాదకరమైనదన్న మాట! బాగా చదువుకున్న వాళ్ళం, డబ్బు స్థోమత ఉన్న వాళ్ళం — మా పనే ఇలా ఉంటే ఇక నిరక్షరాస్యుల సంగతి ఏమిటి??

"ఇందులో నా తప్పేం ఉందో చెప్పరా? అప్పటికే ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఎందరో సైకియాట్రిస్టులను కన్సల్ట్ చేశాం. నెమ్మదిగా తనే ఎప్పటికో తెరుకోవాలే తప్ప ఇప్పుడు వెంటనే తేరుకొనే ప్రశ్నే లేదన్నారు. నేర్వ్ సెల్స్ తిరిగి పని చేసేలా చేయించటం ఎవరి తరమూ కాదని స్పష్టంగా అందరూ చెప్పారు."

"అయితే ఇక్కడ చేర్చావా?" అనడిగాను.

సారంగపాణినవ్వాడు — "నాకు బోలెడంత ఆస్తి ఉంది. డబ్బు ఉంది. పలుకుబడి ఉంది. సంఘం నుంచి నాకేం అవసరం ఉన్నా అది పొందే అవకాశం ఉంది. కానీ నా ఆస్తికి వారసుడేండు, వీడు తేరుకొంటే తప్ప. అది దాదాపు అసాధ్యం అన్నారు డాక్టర్లు. ఇక నా డబ్బుతో ఏం చేసుకోవాలి? అందుకే ఇక్కడ ఈ హోమ్ తెరిపించాను. నా డబ్బు ఇప్పుడు సద్వినియోగం అవుతూందని పిస్తూంది. హోమ్ తెరిపించాక తెలిసింది ఈ చుట్టుపక్కలే ఇలాంటి కుర్రాళ్ళు యాభైమంది ఉన్నారని! ఇప్పు డిక్కడ అందరికీ స్థానం కలిగించాను."

"ఏభై మందికి తిండీ, బట్టా వైద్యం ఇస్తున్నాను. దేవుడు నాకు నా బాబును తిరిగి ఇస్తే చాలు, ఇంకేం అక్కర్లేదు." యశోద బాధ.

నేనేమీ అనలేదు — ఎంత పంచుకున్నా తరగని కడుపుకోత అది!

ఎందు కిలా జరిగింది? — బాబు ఇలా కాకపోతే సారంగపాణి ఇంత ఖర్చుపెట్టేవాడా? దేవుడి లీలలు ఇంతేనా? — అయినా అవకాశం ఉండి సారంగపాణి ఇలా హోమ్ తెరిపించాడు. అదే ఏ బీద పిల్లాడి పరిస్థితో ఇలా అయి ఉంటే, 'ఖర్మ' అని ఆ తల్లి తండ్రులు సరిపెట్టుకునే వారేమో!

అంతే, అంతకుమించి ఇంకేం ఉంది అవకాశం వారికి?

దేశంలో ఆరోగ్యంగా ఉండే పిల్లల గురించే పట్టించుకొనేంత శ్రద్ధ ఎవరికీ లేదు. తల్లితండ్రులకు ఏ పూటకు ఆ పూట గడుపుకోవటమే ధ్యాస. ఇక ఎవరికి శ్రద్ధ? అందులోనూ ఇలాటి మానసికంగా అనారోగ్యంగా ఉండే పనికిరాని పిల్లల గురించి ఇంకెవరికి ఆలోచన?

సారంగపాణి లాటి డబ్బు ఉండేవారు తన దాకా వస్తే ఏ మంచి పనీ తలపెట్టరు కానీ మరింకెలా? ఎలా??

నా ఆలోచన లన్నింటికీ అంతరాయం కలిగిస్తూ కారు హారన్ మోగించాడు సారంగపాణి పరధ్యాన్యంగా కూర్చున్నాను కార్లో.

కారు కదిలి భవనం ముందు ఆగింది. లోపలకు నడిచాం, చేతుల్లో పళ్ళతో బాబు సారంగపాణి, యశోదల కలల పంట — నన్ను గుర్తు పట్టనే లేదు. ఏవో బొమ్మలు వేస్తుండి పోయాడు. చేతికి ఆపిల్ అందించినా అందుకోలేదు. తలెత్తి మళ్ళీ బొమ్మలో మునిగిపోయాడు.

యశోద కళ్ళల్లో నీళ్ళు...

కన్నీరు ఆపుకున్నాను నేను.

కారెక్కి తిరిగి వస్తుంటే అంది యశోద—"ఇంత క్రితం నాకు ఒక్కడే బాబు — ఇప్పుడు కనీసం ఏభైమంది!!"

సారంగపాణి వెంటనే అందుకున్నాడు "మరి కాశీ దుకాణం దగ్గరి పిల్లల సంగతి ఏమిటి?"

"వాళ్ళంతా నీపిల్లలు—తల్లికి ఎప్పుడూ దెబ్బతిన్న పిల్లాడి మీద మమకారం ఎక్కువ అంటారు" అన్నాను నేను కలగజేసుకుంటూ.

ఇక ఆ తరవాత ఏమీ మాట్లాడలేదు— ఎవ్వరమూ.

బాబును చూసిన ఉత్సాహం చచ్చిపోయింది వాలో.

తిరిగి వచ్చేటప్పుడు కాశీ దుకాణం దగ్గర కారు ఆపలేదు సారంగపాణి.

నగరం పొలిమేరల్లోకి వసన్తుంటే కారు పక్కకు తీసి, ఆపి, కార్లోంచి దిగాడు సారంగపాణి. నేనూ దిగాను.

సారంగపాణి తలెత్తి ఏదో చదువుతున్నాడు. ఆ బోర్డు మీద ఉన్న అక్షరాలు నేనూ చదివాను. 'ఎ హేపీ ఛైల్డ్ నేషన్స్ ప్రైడ్' అని ఉంది. 'సంతోషంగా ఉండే బాలలే దేశానికి గర్వ కారణం.'

సారంగపాణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ కన్నీటిలో నాకు బాలల కోసం దేశం ఏం చేస్తూందనే ప్రశ్న స్పష్టంగా కనపడింది.

నా కళ్ళు కన్నీటితో నిండాయి. ★